క్లుప్తంగా

ఇంటర్వ్యూలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్‌లో ఖాళీగా ఉన్న 8 రేషన్ డీలర్ల భర్తీకి గాను పరీక్షలు రాసిన అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఆర్డీవో మన్నె ప్రభాకర్ తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో డీసీఎస్‌వో నిత్యానందంతో కలిసి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. 37 మందికి ఐదుగురు గైర్హాజరు కాగా 32 మందికి ఇంటర్వ్యూలు చేశామన్నారు.

స్థలాల పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : బ్రాహ్మణపల్లి, సాతేలి గ్రామాలలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించిన స్థలాలను అధికారులు మంగళవారం పరిశీలించారు. ఎల్‌ఆర్‌ఎస్ కమిటీ సభ్యులు గిర్దావార్ శ్రీనివాస్, ఎంపీవో ప్రకాష్, నీటిపారుదల శాఖ ఏఈ శ్రీకాంత్‌లు స్థలాలను సందర్శించారు. క్షేత్రస్థాయి రిపోర్టును ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు వారు తెలిపారు.

లింగంపేటలో పారిశుధ్య పనులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం ఎంపీడీవో నరేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ సిబ్బందితో రోడ్ల ప్రక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ప్రతి రోజు ట్రాక్టర్ ద్వారా వీధుల్లో చెత్తా చెదారం సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని జీపీ కార్మికులను ఆదేశించారు. అలాగే మురికి కాల్వల్లో పూడిక తీయాలని సూచించారు. ఎంపీవో మలహరి, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో గల ఎస్టీ గురుకుల బాలుర పాఠశాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారి దయానంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాల ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. భోజనం పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరంగా అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలను సరిగ్గా నమోదు చేయాలని ఆరోగ్య సూపర్ వైజర్ మనోహర్‌ను ఆదేశించారు. వైస్ ప్రిన్సిపాల్ పోశెట్టి, ఉపాధ్యాయులున్నారు.

ఇంటింటి సర్వే చేపట్టాలి

రాజంపేట: ఈ నెల 28 వరకు ఇంటింటి సర్వే చేసి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్‌గా నమోదు చేసేలా కార్యక్రమాలు చేపట్టాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మంగళవారం బూత్ స్థాయి అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. చనిపోయిన వారినీ, పలుమార్లు నమోదైన వారినీ ఓటరు లిస్ట్ నుంచి తొలగించాలని, తప్పొప్పులు ఉంటే సరి చేయాలని, వికలాంగులను వృద్ధులను గుర్తించి వారి లిస్ట్ సిద్ధం చేయాలని సూచించారు.

ఇసుక వేలం

బిచ్కుంద(జుక్కల్): హజ్గుల్ శివారులో అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపులకు మంగళవారం రెవెన్యూ అధికారులు వేలం పాట నిర్వహించారు. వేలం పాట ద్వారా ప్రభుత్వానికి రూ.16,700 ఆదాయం వచ్చిందని తహసీల్దార్ సురేష్ తెలిపారు. మూడు రోజుల క్రితం కొందరు హజ్గుల్ శివారులో ఇసుక డంపులు వేయడంతో సీజ్ చేసి పైఅధికారుల ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహించామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక డంప్ చేసి ట్రాక్టర్లు, లారీలలో రవాణా చేస్తే గ్రామస్తులు అడ్డుకొని అధికారులకు సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

అందరికీ రుణమాఫీ చేయాలి



బాన్సువాడ: అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడ అంబేడ్కర్ చౌరస్తా వద్ద రుణమాఫీ కాని రైతులతో కలిసి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద ప్రతి రైతుకు ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలని, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని అన్నారు. 60 శాతం మందికి రుణమాఫీ కాలేదన్నారు. నాయకులు శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, తదితరులున్నారు.

నూతనంగా రుణాలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కి పీఏసీఎస్‌లో మంగళవారం 77 మంది రైతులకు రూ.37లక్షలు విలువైన కొత్త రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్, సొసైటీ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. రుణాలు అందించిన బ్యాంకు మేనేజర్ సందీప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రూ.22లక్షలతో నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. సీఈవో గంగాధర్, సొసైటీ వైస్ చైర్మన్ అరుణ్, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా సిగ్నల్ వ్యవస్థ

- నిబంధనలు పాటించని వాహనదారులు
- ఎక్కడపడితే అక్కడ వాహనాల పార్కింగ్
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



బాన్సువాడ తాడ్కోల్ చౌరస్తా వద్ద అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహన చోదకులు

బాన్సువాడ : బాన్సువాడలో వాహనాలతో పాటు ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. దానికి తోడు ఇష్టారీతిన వాహనాల పార్కింగ్‌తో ఇక్కట్లు అధికమవుతున్నాయి. ప్రధాన చౌరస్తాలలో వాహనాలు ఎటు నుంచి ఎటు వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఉంది. సిగ్నల్ వ్యవస్థ ఉన్నప్పటికీ.. ఆ నిబంధనలను ఎవరూ పట్టించుకోవడం లేదు. నియంత్రించేందుకు హోంగార్డులున్నప్పటికి వారిని పట్టించుకునే వారే లేరు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని కొత్త మున్సిపల్ కార్యాలయం నుంచి బస్ డిపో వరకు రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాల ముందు పార్కింగ్ చేయడం వల్ల వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. వ్యాపారులు అద్దెలకు ఆశపడి దుకాణాల ముందు రోజువారీ వ్యాపారులకు అద్దెకు ఇవ్వడంతో ఆయా దుకాణాల ముందు వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా తాడ్కోల్ చౌరస్తా, స్టేట్ బ్యాంకు ఏరియా, అంబేద్కర్ చౌరస్తా, పాత బాన్సువాడకు వెళ్లే దారిలో, బీసీ హాస్టల్ రోడ్డు వద్ద ట్రాఫిక్ సమస్య నిత్యం ఉత్పన్నం అవుతుంది. ప్రతి గురువారం బాన్సువాడలో సంత ఉంటుంది. ఆ రోజు రోడ్డుపై వెళ్లే వారికి నరకం కనబడుతుంది. ఆటోలు, బైక్‌లను రోడ్డుపై నిలపడంతో వచ్చి పోయే వారికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పట్టణంలో నాలుగు చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు అయినప్పటికి కేవలం అంబేద్కర్ చౌరస్తా వద్ద మాత్రమే సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి మిగతా తాడ్కోల్ చౌరస్తా, బీసీ హాస్టల్ రోడ్డు, పాత అంగడి బజారులో ఇప్పటికీ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా పోలీస్ శాఖ అధికారులు ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలని, రోడ్డుపై పార్కింగ్ చేసే వాహనాల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రుణమాఫీ చేయాల్సిందే



తాడ్వాయిలో కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పంట రుణ మాఫీ పూర్తి స్థాయిలో చేయలేదని నిరసిస్తూ మంగళవారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు సీఎం మాట తప్పారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీఎం పదవికి రాజీనామా చేయాలన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎలాంటి షరతులు లేకుండా రుణాలను మాఫీ చేయాలని కోరుతూ మండల కేంద్రంలో రైతులు ఆందోళనకు దిగారు. రుణమాఫీ విషయంతో కొర్రీలు పెడుతూ అన్యాయం చేస్తున్నారని రైతులు విమర్శించారు. సీఎంరేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించారు. అరగంట పాటు రాస్తారోకో చేయడంతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని రైతులతో మాట్లాడి రాస్తారోకోను విరమించారు. తహసీల్దార్ సరళకు వినతిపత్రాన్ని అందజేశారు.



అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామీణ బ్యాంక్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

'విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి'

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌తోపాటు కస్తూర్బా, మోడల్ స్కూళ్లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. హాస్టల్‌లో నిల్వ ఉన్న సరుకులను ఆయన పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులకు మెనూప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. దీంతోపాటు కస్తూర్బా పాఠశాల విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను వారు తెలుసుకున్నారు. ఆయనవెంట హాస్టల్ వార్డెన్ రాములు, కస్తూర్బా ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలత, జీపీ కార్యదర్శులు కిష్టయ్య, కార్తీక్, మమత తదితరులున్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

ఓటరు నమోదుపై శిక్షణ



బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ నరేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలకు ఓటరు నమోదుపై శిక్షణ ఇచ్చినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికలకు ఓటరు జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. తప్పొప్పులు సరి చేయడం, కొత్త ఓటర్లను నమోదు చేసుకోవడం తదితర పనులు ప్రారంభించాలని సూచించారు. ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎంపీడీవో సాజీద్ అలీ

ఓటరు లిస్టును సరి చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఓటరు లిస్టును సరి చేయాలని ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ కార్యదర్శులు ఓటరు లిస్టును సరిచేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఇతర వార్డులలో ఉంటే వారిని ఒకే వార్డులోకి వచ్చేలా చూడాలన్నారు. ప్రతిసారీ ఓట్లు వేసేటప్పుడు ఓటర్లు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీవో సవితారెడ్డి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నేడు భారత్ బంద్



బాన్సువాడ సీఐకి వినతిపత్రమిస్తున్న నేతలు

బాన్సువాడ రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల ఉపకులాలు, జాతీయ సంఘాల పిలుపు మేరకు బుధవారం భారత్‌బంద్‌లో భాగంగా బాన్సువాడలో బంద్‌కు సహకరించాలని మాలమహానాడు నాయకులు కోరారు. మంగళవారం వారు బాన్సువాడ సీఐ కృష్ణను కలిసి బంద్‌కు సహకరించాల్సిందిగా కోరుతూ వినతి పత్రం ద్వారా భారత్‌బంద్ సమాచారం అందించారు. నాయకులు మేకల సాయిలు, దేశాయిపేట్ ప్రశాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోరాట సమితి నాయకులు

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్: సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ జాతీయ మాల మహానాడు పిలుపు మేరకు నేడు(బుధవారం) భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కార్యనిర్వహణ కార్యదర్శి ఎడ్ల రాజు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉన్న మాల మాదిగల మధ్య విభజించు పాలించు అనే నినాదంతో వర్గీకరణ చేయడం సరికాదన్నారు. నాయకులు సుధాకర్, సత్యం, రమేస్, రాజలింగం , భూపతి, భూమేష్,శంకర్ తదితరులున్నారు.

సంక్షిప్తం

ఓబీసీ విభాగం కన్వీనర్‌గా రామలింగం

నిజాంసాగర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం కన్వీనర్‌గా మేదరి రామలింగంను నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ఓబీసీ విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. వెల్గనూర్ గ్రామానికి చెందిన రామలింగం కాంగ్రెస్ పార్టీలో చురుకుసై నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయడంతోనే తనకు ఈ గుర్తింపు దక్కిందన్నారు.

మాల్తుమ్మెద ట్రాన్స్‌కో లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా సూర్యా

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా సూర్యా మంగళవారం విధుల్లో చేరారు. గతంలో విధులు నిర్వహించిన సుదర్శన్ ఇటీవల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడంతో ఎల్లారెడ్డి పట్టణంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహించిన సూర్యా పదోన్నతిపై ఆయన స్థానంలో వచ్చారు. స్థానిక ఏఈ మనోరంజన్‌కు రిపోర్ట్ చేశారు. ఆయనవెంట ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ చంద్రకాంత్‌రెడ్డి ఉన్నారు.

పలువురు వ్యవసాయాధికారుల బదిలీ

బీబీపేట: వ్యవసాయ అధికారుల బదిలీల్లో భాగంగా బీబీపేట మండల వ్యవసాయాధికారిగా పనిచేసిన పవన్‌కుమార్ కామారెడ్డికి బదిలీ అయ్యారు. యాడారం క్లస్టర్ ఏఈవో లత పెద్దమల్లారెడ్డికి, మాందాపూర్ క్లస్టర్ ఏఈవో సాగర్ నిజాంసాగర్‌కు బదిలీ అయ్యారు. వారి స్థానంలో యాడారం క్లస్టర్ నూతన ఏఈవోగా సంతోష్, మాందాపూర్ క్లస్టర్ నూతన ఏఈవోగా రాజేష్‌లు వచ్చారు.

47వ వార్డులో మొక్కల పంపిణీ

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని 47వ వార్డులో ఇంటింటికి కలిపి మొత్తం 200 మొక్కలను వార్డు కౌన్సిలర్ గెరికంటి స్వప్న పంపిణీ చేశారు. మొక్కలను ఇంటి ఆవరణలో నాటి వాటిని సంరక్షించాలని కాలనీవాసులను కోరారు. నాయకులు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ప్రత్యేకాధికారి రజిత

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మండల ప్రత్యేకాధికారి రజిత మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలతో పాటు కళాశాల ప్రాంగణంలోని భోజనశాల, తరగతి గదులను ఆమె పరిశీలించారు. ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

కస్తూర్బా పాఠశాలలో కంటి పరీక్షలు

భిక్కనూరు: జంగంపల్లి కస్తూర్బ పాఠశాలలో విద్యార్థినులకు ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు మంగళవారం నిర్వహించారు. కంటి వైద్యుడు రవీందర్ పటేల్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తీసుకోవాల్సిన చర్యలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఉప్పల్‌వాయి గురుకులంలో..

రామారెడ్డి: ఉప్పల్‌వాయి గురుకుల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 63 విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు రామారెడ్డి ప్రభుత్వ వైద్యాధికారి సురేష్ తెలిపారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ శివరాం, వైద్య సిబ్బంది జార్జ్, జానకమ్మ, చంద్రకళ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ హయాంలోనే ఐటీ అభివృద్ధి

రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలోనే భారతదేశంలో ఐటీ రంగం గణనీయంగా అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ..రాజీవ్ గాంధీ ఆదర్శప్రాయుడని అన్నారు. ఐటీ రంగం అభివృద్ధితో పాటు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించడం లాంటి సంస్కరణలు ఆయన తీసుకొచ్చారని అన్నారు. అలాగే పేదల అభ్యున్నతి కోసం అనే సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. రాజీవ్ చేసిన సేవలను ప్రశంసించారు. పలు ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ..



రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బాన్సువాడలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి. పక్కన ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



దోమకొండలో ..



పిట్లంలో..



మద్నూర్‌లో..



తాడ్వాయిలో..



భిక్కనూరులో..



మాచారెడ్డిలో..

సాగులో జాగ్రత్తలు పాటించాలి

రాజంపేట: రాజంపేట రైతు వేదికలో మంగళవా రం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఏవో సునీతా రాణి ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. వరి పంటలో అక్కడక్కడ మొగి పురుగు గమనించామన్నారు. ప లు సూచనలు సలహాలు ఇచ్చారు. మొక్కజొన్న పంటలో ఆకులు, ముదురు నీలి రంగులోకి మారి వడలిపోతాయని.. ఈ లోపం గమనించిన వెంటనే డీఏపీ పోషక ఎరువును 2 గ్రాములు లీటర్ నీటికి క లిపి పిచికారి చేయాలని, అలాగే ఎరువుల యాజ మాన్యం కలుపుతీత క్రమక్రమంగా చేయడం వల్ల చీడపీడల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. వ్యవసా య విస్తరణ అధికారులు శిల్ప, రజిత పాల్గొన్నారు.

పంట సస్యరక్షణపై అవగాహన

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుందలోని రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ అధికారులు, ఏఈవోల కు పంటల సస్యరక్షణ, ఎరువుల మోతాదు, చీడపీడల నివారణ తదితర అంశాలపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులు అవగాహన కల్పించారు. పత్తి, సోయా, వరి, మినుము, మిర్చి, మొక్కజొన్న పంటలలో దిగుబడి పెరగడానికి తీసుకోవాల్సిన చర్య లు, ఏ మోతాదులో ఎంత మందు వాడాలో వివరించారు.

బంద్ ప్రశాంతం

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మంగళవారం రాజంపేట, సదాశివనగర్‌లో హిందు సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. వ్యాపార సముదాయాలు, ప్రైవేటు విద్యా సంస్థలు, ఇతర వ్యాపార దుకాణాలు స్వచ్ఛందంగా బంద్ చేసి నిరసనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ..బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరగడం చాలా బాధాకరమన్నారు. బుధవారం బీబీపేట బంద్‌కు హిందూ ఐక్య వేదిక నేతలు పిలుపునిచ్చారు. - రాజంపేట/సదాశివనగర్/ కామారెడ్డి క్రైం



రాజంపేటలో మూసి ఉంచిన దుకాణాలు



సదాశివనగర్‌లో దుకాణాలను బంద్ చేయిస్తున్న హిందూ సేన ప్రతినిధులు



రాజంపేటలో కొవ్వొత్తులతో ర్యాలీ



బీబీపేటలో ఫ్లెక్సీతో హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు

సమాచారం..

31న జపయజ్ఞం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పాత పట్టణం పురాతన కోడూరు అంజనేయస్వామి ఆలయంలో ఈనెల 31న శ్రావణమాసం చివరి శనివారం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వేదపండితులు అంజనేయశర్మ ఆధ్వర్యంలో శ్రీరుద్రైకాదశీమంత్ర జపయజ్ఞం, చందనార్చన పూజమహోత్సవం, సామూహిక హన్మాన్ చాలీసా పారాయణం, యజ్ఞపూర్ణాహుతి, అనంతరం అన్నప్రసాదం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. పూజమహోత్సవంలో పాల్గొనేవారు 98663 66168 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై విచారణ



రామారెడ్డి: అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా రామారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలలో చేపట్టిన పనులను ఇరిగేషన్ డీఈ శాలిని, ఏఈ సంతోష్, ఎంఈఓ యోసేపు.. గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఒక లక్ష 60 వేల రూపాయల నిధులతో బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు చేపట్టిన పనులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో మంగళవారం డీఈ, ఏఈ, ఎంఈవో పనులను పరిశీలించడానికి వచ్చారు. పనులు సక్రమంగా చేయకపోవడంతో ఇద్దరు ఉపాధ్యాయులను వారు మందలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను నాణ్యతతో వారంలోగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మాగౌడ్, గ్రామస్తులు ఉస్కే రాజేందర్, బండకింది రమేష్, తదితరులు పాల్గొన్నారు.